క్లుప్తంగా

వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎల్లేటి సత్యనారాయణ

నక్కపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో ఆ పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి, జిల్లా చేనేత కార్మిక సంఘ నేత ఎల్లేటి సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ ప్రస్తుత పరిస్థితిపై జగన్ ఆరా తీశారని, గతంలో ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకం ద్వారా నియోజకవర్గంలో వందలాది మంది నేత కార్మికులు ఏవిధంగా లబ్ధిపొందారో ఆయనకు వివరించానని సత్యనారాయణ చెప్పారు. కుల వృత్తికి దూరమైన నేత కార్మికులకు ఏటా రూ.24 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు



స్కూల్ క్యాబినెట్‌లో ఎన్నికైన విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలోని కనోస్సా పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ సెరమనీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాబినెట్ ఎలక్షన్‌లో ఎన్నికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సంతాన థామస్, సిస్టర్ ధంకెమ్ జాన్ అభినందించారు. సిస్టర్ జోసెఫ్, పి.జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

మునగపాక: పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు అన్నారు. గవర్ల అనకాపల్లి ఆవ కాలువ సమీపంలో పైప్‌లైన్‌కు బుధవారం మరమ్మతులు చేయించారు. ముత్రాసు కాలనీకి వెళ్లే పైప్‌లైన్ దెబ్బతినడంతో స్పందించి తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమయ్యే చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాపేటి పరమేష్, మహలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు, రేపు అంతరాయం

పాయకరావుపేట: పట్టణంలోని విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా సత్యవరం, శ్రీరాంపురం ఉపకేంద్రం పరిధిలో గల గ్రామాలకు గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని బృందావనం, ప్రశాంతినగర్, రాజుగారిబీడు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చురుగ్గా జల్ జీవన్ మిషన్ పథకం పనులు



గంగాదేవిపేటలో నిర్మిస్తున్న ట్యాంక్

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో రక్షిత మంచినీటి పథకం పనులు చకచకా జరుగుతున్నాయి. గ్రామంలో ఇంటింటికీ శుద్ధమైన నీరు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.40లక్షలు మంజూరు చేశారు. 20వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మిస్తున్నారు. తద్వారా ఇంటింటికీ నీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేష్ తెలిపారు.

యలమంచిలి బస్టాండు.. సమస్యలు మెండు

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది ఆర్టీసీ పరిస్థితి. ప్రయాణికుల క్షేమమే మా ధ్యేయం.. వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్న సంస్థ అధికారుల మాటలు ఆచరణలో కానరావడం లేదు. నియోజకవర్గ కేంద్రం యలమంచిలి బస్టాండ్‌లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా.. పట్టించుకోవడం లేదు. ప్రయాణికుల సంఖ్య పెరిగినా కనీస వసతులు కరువవడంతో సమస్యల ప్రాంగణంగా మారింది.



సమస్యలకు నిలయమైన యలమంచిలి బస్ కాంప్లెక్స్



అలంకారప్రాయంగా టీవీ

- బస్ కాంప్లెక్స్‌లో పనిచేయని టీవీలు, సీసీ కెమెరాలు
- తాగునీటి సౌకర్యం నిల్
- దుర్గంధభరితంగా కాంప్లెక్స్ పరిసరాలు
- ఆకతాయిల ఆగడాలతో విద్యార్థినులు, మహిళలకు ఇబ్బందులు

యలమంచిలి రూరల్: యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. కాంప్లెక్స్ ప్రాంగణంలోకి వెళ్తే.. ముక్కు మూసుకోవాల్సిందే. అక్కడే మూత్ర విసర్జనతో భరించలేని దుర్గంధం వెలువడుతోంది. మరుగుదొడ్లు, చెత్త కుప్పల నుంచి కంపు వస్తోంది. ప్రాంగణం వెనుక భాగంలో హోటళ్లు, మరుగుదొడ్లు నుంచి మురుగు నీరు పోయే పైప్‌లైను వ్యవస్థ దెబ్బతింది. మురుగు బయటకు లీకవుతుండటంతో తీవ్రమైన దుర్వాసన ప్రయాణికులు, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో దోమలు రాత్రి, పగలు తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. సౌకర్యాల కల్పన పేరుతో అధికారులు చార్జీలు వసూలు చేస్తున్నారే కానీ.. వాటి మాట మరిచిపోయారన్న విమర్శలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

తాగునీటి సౌకర్యం లేదు

నిత్యం సుమారు 2 వేల మంది ప్రయాణికులు యలమంచిలి బస్ కాంప్లెక్స్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపు 70 బస్సు సర్వీసులు ఈ కాంప్లెక్స్‌కు వచ్చి పోతుంటాయి. ఇంత రద్దీగా ఉండే ఈ ప్రాంగణంలో 20 ఏళ్లుగా తాగునీటి సౌకర్యం లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. సుమారు దశాబ్దంన్నర కిందట ఇక్కడ రెండు కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటి నుంచి వచ్చే నీరు తాగేందుకు సురక్షితం కాదని గతంలో ప్రజారోగ్య విభాగం అధికారులు చేసిన పరీక్షల్లో వచ్చిన నివేదికల్లో స్పష్టమైంది. ఈ రెండు కుళాయిలు కూడా నాచుపట్టి, అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు గొంతు తడుపుకోవడానికి దుకాణాల వద్ద మినరల్ వాటర్ బాటిళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. రద్దీగా ఉండే ఈ బస్ కాంప్లెక్స్‌లో సురక్షితమైన తాగునీటిని అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా టీవీలు, సీసీ కెమెరాలు

ప్రయాణికులకు వినోదంతోపాటు బస్సుల రాకపోకలను తెలియజేయడానికి బస్ క్లాంప్లెక్స్‌లో గతంలో ఏర్పాటు చేసిన టీవీలు పనిచేయడం లేదు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అమర్చిన సీసీ కెమెరాలది అదే పరిస్థితి. కొంతకాలంగా ఇక్కడి సీసీ కెమెరాలు సాంకేతిక లోపంతో పనిచేయకపోయినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. వీటికి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేయడంతో అలంకారప్రాయంగా మారాయి.

హద్దు మీరుతున్న ఆకతాయిలు

బస్ కాంప్లెక్స్‌లో నిత్యం ఆకతాయిలు తిష్ట వేసి హద్దు మీరి ప్రవర్తిస్తున్నారు. సాయంత్రం స్కూళ్లు, కాలేజీలు విడిచిపెట్టే సమయానికి అక్కడ చేరి బస్సుల కోసం వేచి ఉండే విద్యార్థినులు, యువతులు, మహిళలపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. అసభ్యకర ప్రవర్తన, మాటలతో వెకిలి చేష్టలకు పాల్పడుతున్న ఆకతాయిల కారణంగా విద్యార్థినులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారి వేధింపులు భరించలేని కొందరు విద్యార్థినులు చదువు మధ్యలో మానేస్తున్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న వారి ఆట కట్టించాల్సిన పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. అప్పుడప్పుడూ బస్ కాంప్లెక్స్ వద్దకు పోలీసులు వస్తున్నా.. వారిని గమనించి అక్కడ్నుంచి తప్పుకుంటున్న ఆకతాయిలు పోలీసులు ఇలా వెళ్లగానే వారు అలా వచ్చి తమపని దర్జాగా చేసుకుంటున్నారని విద్యార్థినులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో గంజాయి, మద్యం మత్తులో కొందరు తూలుతూ కాంప్లెక్సులోని బెంచీలపైనే పడుకుంటున్నారు. వారి చేష్టలకు భయపడి మహిళా ప్రయాణికులు రాత్రి వేళల్లో ఇక్కడ వేచి ఉండలేని పరిస్థితి నెలకొంటోంది. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మఫ్టీలో పోలీసులను ఉంచి పోకిరీల ఆట కట్టించాలని, మందుబాబుల బెడద తొలగించాలని విద్యార్థినులు, మహిళలు పట్టణ పోలీసులను కోరుతున్నారు.



బస్ కాంప్లెక్స్‌లో పనిచేయని సీసీ కెమెరాలు



బస్ కాంప్లెక్స్ వద్ద వ్యర్థాలతో నిండి రోత పుట్టిస్తున్న డ్రైనేజీ

ఈవ్ టీజింగ్‌ను అరికట్టాలి



యలమంచిలి బస్ కాంప్లెక్స్‌లో ఈవ్ టీజింగ్ బెడద ఎక్కువగా ఉంటోంది. అందరూ చూస్తుండగానే ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. ఆకతాయిల వేధింపులను భరించలేక కొందరు బాలికలు చదువు మధ్యలో మానేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దుర్భాషలాడటం, దాడులు చేసి పారిపోవడం చేస్తున్నారు. పోలీసులు విద్యార్థినులకు రక్షణ కల్పించాలి. ఇలాంటివి వెంటనే అరికట్టాలే చర్యలు తీసుకోవాలి.

– మామిడి రమణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

కాంప్లెక్స్ అంతా దుర్వాసన



యలమంచిలి బస్ కాంప్లెక్స్ పరిసరాలన్నీ అధ్వానంగా ఉన్నాయి. ఎటు చూసినా పారిశుద్ధ్య లోపమే కనిపిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ పాడై మురుగునీరు బయటకు ప్రవహిస్తోంది. దీంతో తీవ్రమైన దుర్వాసన వెలువడుతోంది. వేలాది మంది ప్రయాణం చేసే బస్ కాంప్లెక్స్‌లో పారిశుధ్యం మెరుగుపర్చాలిన అవసరం ఉంది. ఇక్కడ సమస్యలు పరిష్కరించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎస్.ప్రవీణ్, డిగ్రీ విద్యార్థి

గంగాలమ్మ గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: మండలంలోని మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి పలువురు దాతలు ముందుకొస్తున్నారు. దీనిలో భాగంగా పాటిపల్లి బీసీ కాలనీకి చెందిన కొయిలాడ సూరిబాబు కుమారుడు ప్రసాద్, మహలక్ష్మి దంపతులు రూ.5,116 నగదును బుధవారం విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

పొలంబడితో రైతులకు మేలు



అరబుపాలెంలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

మునగపాక: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి అన్నారు. మండలంలోని అరబుపాలెంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పురుగు మందుల ప్రభావం రైతుపై ఏ విధంగా ఉంటుందో అవగాహన పెంచుకోవాలన్నారు. ముందుగా మట్టి, అలాగే నీటి పరీక్షలు చేయించుకోవాలని, వాటిలో లోపాలు ఉంటే యాజమాన్య చర్యలు పాటించాలని సూచించారు. తెగుళ్ల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్రిమి సంహారక మందులను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం5 గంటల వరకు పిచికారీ చేయాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఏఈవో లక్ష్మి, వీఏఏ సత్య రవిరాజ్, పొలంబడి రైతులు బొడ్డేడ సూరప్పారావు, యల్లపు రామసూరి, బి.గంగాధరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చేపల వేటకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెంలో నేవల్ బేస్ నిర్మిస్తున్న ప్రదేశంలో ఉన్న మొగలో నుంచి త్వరలో చేపల వేట బోట్లు నిలిపేయాల్సి వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పరిశీలిస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ అన్నారు. బంగారమ్మపాలెం తీరాన్ని బుధవారం మత్స్య శాఖ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. బంగారమ్మపాలెం మొగ నుంచి సుమారు నాలుగు గ్రామాల మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లి వచ్చేవారని, నేవల్ బేస్ నిర్మాణ క్రమంలో ఈ దారి మూసేయాల్సి వస్తుందనే సమాచారం మేరకు చేపల వేటకు ప్రత్యామ్నాయంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక అనుకూలతను పరిశీలించి ఏర్పాట్లు చేస్తామన్నారు. అదే సమయంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, స్థానిక గ్రామ పెద్దలు పరిశీలనకు వచ్చిన అధికారులతో మాట్లాడారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా తమకు పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నేవల్ బేస్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. డీఎఫ్‌వో ప్రసాద్, ఎఫ్‌డీవో రవితేజ, నేవల్ డిప్యూటీ తహసీల్దార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బంగారమ్మపాలెం తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీసీ మనోరమ, అధికారులు

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



ఎస్.రాయవరంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి



తడి, పొడి చెత్తల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో తదితరులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని డీపీవో శిరీషారాణి అన్నారు. మండల కేంద్రం నివాసులు మురుగు నీటిని ఇరిగేషన్ కాలువలో వదులుతున్నారన్న ఫిర్యాదు మేరకు బుధవారం ఆమె ఎస్.రాయవరంలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఇరిగేషన్ కాలువలో మురుగు నీటి సమస్య, దిగువ గ్రామాల వారి ఇబ్బందులపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిధులు విడుదల చేస్తే పనులు చేపడతామని తెలిపారు. అనంతరం గ్రామంలోని తడి, పొడి చెత్తల నిర్వాహణ కేంద్రాన్ని డీపీవో శిరీషారాణి పరిశీలించారు. ఈ కేంద్ర నిర్వహణ పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి, సర్పంచ్ భూపతి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో బోరు నిర్మాణం

కోటవురట్ల: జెడ్పీ నిధులతో పాములవాకలో బోరు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ డి.సత్యవతి, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జెడ్పీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రుత్తల రమణ, కిల్లాడ చినరామ్మూర్తి, రైతులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి బోరు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్లస్–2 విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినుల నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథి స్కూల్ హెచ్‌ఎం వి.వి.హిమబిందు, ఉపాధ్యాయులు, పీజీటీలు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, లక్ష్యాలను నిర్దేశించుకుంటూ వాటికి అనుగుణంగా కష్టపడాలని సూచించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. మొదటి సంవత్సరంలో కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థినులను ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు పరిచయం చేసుకున్నారు. అనంతరం విద్యార్థినులంతా విందు ఆరగించారు. కార్యక్రమంలో మువ్వల రాంబాబు, పద్మకుమార్, ప్రశాంతి, సరయ్య, అన్నపూర్ణ, జి.పి.సత్యానిబాబు, శ్రీనివాసు, లల్లీ సుమారు 600 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

ప్రశాంతంగా విశ్రాంత జీవితం



సన్యాసిరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, ఉపాధ్యాయులు

కోటవురట్ల: విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ సూచించారు. చౌడువాడ ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన సత్యాడ సన్యాసిరావు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సన్యాసిరావు దంపతులను రఘువర్మ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైనదని, ఎందరో మార్గదర్శకులను తయారు చేసిన ఘనత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇ.వి.రమణ, సంగీత్‌రాజ్, గణపతి, జాన్‌సుధాకర్, బాలు, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ములబంద గోడీ రైతు సంఘం అధ్యక్షుడిగా శివ



ములబంద గోడీ రైతు సంఘ కార్యవర్గం

మునగపాక: మునగపాకలో పేరు గాంచిన ములబంద గోడీ రైతు సంఘ అధ్యక్షునిగా దాడి శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంతబయిల వినాయక కల్యాణమండపంలో సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా శివ, కార్యదర్శిగా ఆడారి రాము, కోశాధికారిగా దొడ్డి గంగసూరప్పారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు దాడి సూరిబాబు, బొడ్డేడ రామునాయుడు, టెక్కలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో గుర్తింపు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం రత్నరాజు పదవీ విరమణ సందర్భంగా హైస్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో రత్నరాజు ఎంతో కృషి చేశారని, ఇతర ఉపాధ్యాయులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, సూరిశెట్టి రాము, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హృదయాల్లో ఉపాధ్యాయుడి స్థానం పదిలం

యలమంచిలి రూరల్: విద్యార్థుల హృదయాల్లో ఉపాధ్యాయుడి స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుందని యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. యలమంచిలి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ జి.ఐ.సత్యంబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యంబాబును ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. 29 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మీనాక్షి, అరుణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు, ఉపాధ్యాయులు ప్రశాంతి, కుమారి, డి.పద్మావతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



రత్నరాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నారు కొసలు తుంచి నాట్లు వేయాలి



యండపల్లిలో రైతులకు వరిలో సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న అధికారులు



బి.కె.పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: వరి నాట్లు వేసే ముందు నారు కొసలు తుంచి నాటాలని, తద్వారా ఆకుముడత తెగులును నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. యండపల్లి గ్రామంలో విత్తనోత్పత్తిపై రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి నుంచి పంట కోత వరకు మెలకువలను రైతులు తెలుసుకోవాలన్నారు. విత్తన శుద్ధి, కలుపు యాజమాన్యం, సమగ్ర చీడపీడల యాజమాన్యం, సమగ్ర ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణ చర్యలపై రైతులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం బి.కె.పల్లిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు పాల్గొన్నారు. రైతులకు క్షేత్ర స్థాయిలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంట్రీ పాయింట్ యాక్టివిటీ, పురుగు మందులు అధికంగా వాడటం వల్ల మనుషులపై పడే దుష్ప్రభావం, ఉడుపులో పాటించాల్సిన నియమాలు, నాట్లు వేయడంలో జాగ్రత్తలను వివరించారు. వరి నాట్లు వేసే ముందు నారు వేర్లను సూడోమోనాస్ ద్రావణంలో ముంచి నాటడం ద్వారా పొడతెగులును నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ శ్రీధర్, మండల వ్యవసాయాధికారి బి.సరోజిని, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వేళ విద్యార్థులకు జ్ఞాపిక



కంచాలు అందుకున్న విద్యార్థులతో రిటైర్డ్ టీచర్ వెంకటేష్

అచ్యుతాపురం: ఉపాధ్యాయ వృత్తిలో దశాబ్దాల పాటు సేవలందించిన ఓ ఉపాధ్యాయుడు తన ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపిక ఇవ్వాలని భావించారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పి.టి.వెంకటేష్ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 165 మంది విద్యార్థులకు కంచాలు అందజేశారు. అనంతరం ఆయన్ను సహ ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీపాద రవి, తెలుగు టీచర్ రమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.